ఆర్టీసీ.. గాడిన పడేనా..?



- తిరుపతిలో చాలామంది సిబ్బంది డ్యూటీ విషయంలో నిర్లక్ష్యం
- ఉద్యోగ సంఘాలను అడ్డుపెట్టుకుని పెత్తనం
- గత డీపీటీఓకు బెదిరింపుల పర్వం
- వారం రోజుల ముందే డీపీటీఓ వెంకట్రావ్ నియామకం
- ఆదాయ రాబడిలో తిరుపతి జిల్లా ఫస్ట్
- కొత్త డీపీటీఓ అయినా కంట్రోల్ చేస్తారా ?

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి జిల్లా ఆర్టీసీ 11 డిపోలతో రాష్ట్రంలోనే పెద్ద జిల్లాగా ఉంది. అంతేకాకుండా 2024–25 జిల్లా రాబడి రూ.572 కోట్లతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది. జిల్లాల పునర్విభజన అనంతరం ప్రతి ఏటా తిరుపతి జిల్లానే రాబడిలో ముందు వరుసలో ఉంది. ఐదు వేలమందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అదేస్థాయిలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు జిల్లాలో పటిష్టంగా ఉన్నాయి.

నిత్యం సెలవుల్లోనే కొందరు..

అయితే కొందరు ఉద్యోగ సంఘం నేతలు ఆర్టీసీ జిల్లాస్థాయి అధికారులపై తీవ్రమైన ఒత్తిడి చేసి తమ పనులు చక్కబెట్టుకుని పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంకొందరు డ్యూటీలు చేయకుండా నిత్యం సెలవుల్లో ఉంటూ దర్శనం నిమిత్తం జిల్లాకు వచ్చే రాష్ట్రస్థాయి ఆర్టీసీ అధికారులతో సన్నిహితంగా ఉంటూ తమ పనులు చేసుకుంటున్నారు. అయితే ప్రమాదాలు చేసిన డ్రైవర్లు, డ్యూటీలు సక్రమంగా చేయని కండక్టర్లు, క్రమశిక్షణ లేని గ్యారేజ్ సిబ్బంది ఇలా ఆర్టీసీ పరిధిలోని అన్ని విభాగాల్లోనూ రూల్స్‌కు విరుద్ధంగా పనిచేస్తున్న వారిని ఉద్యోగ సంఘం నేతలు వెనుకేసుకొస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల ఓ ఉద్యోగ సంఘం నేత అప్పటి డీపీటీఓను తమ పనులు చేయాలంటూ బెదిరింపులకు గురిచేసినట్లు చర్చసాగుతోంది. మొత్తంగా జిల్లాలో కొందరు ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు చెప్పిందే శాసనంగా మారుతోంది.

ఇప్పుడైనా గాడిలో పెడతారా..?



కే.వెంకట్రావ్, జిల్లా నూతన డీపీటీఓ

గాడి తప్పుతున్న తిరుపతి ఆర్టీసీని సక్రమంగా నడిపించడానికి వారం రోజుల ముందే సమర్థవంతమైన అధికారిని ఏర్పాటు చేయాలని పది రోజులుగా విజయవాడ ఆర్టీసీ పెద్దలు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఆర్టీసీ రూల్స్‌కు విరుద్ధంగా పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్న ఉద్యోగ సంఘం నేతల దూకుడుకు వెంకట్రావ్ పగ్గాలు వేస్తారా ? వదిలేస్తారా ? అనేది చూడాలి.

జిల్లా ప్రజా రవాణా అధికారిగా ప్రకాశం జిల్లా డీపీటీఓగా పనిచేస్తున్న కే.వెంకట్రావ్‌ను సర్కార్ నియమించింది. ఆ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ప్రస్తుత జిల్లా డీపీటీఓగా పనిచేస్తున్న నరసింహులు ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే గాడి తప్పుతున్న జిల్లా ఆర్టీసీని సక్రమంగా నడిపించడానికి వారం రోజుల ముందే అధికారిని ఏర్పాటు చేశారంటూ ఆర్టీసీలో జోరుగా చర్చసాగుతుంది.

క్లుప్తంగా

బీపీఈడీ ఫలితాలను విడుదల చేయాలి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో బీపీఈడీ 3, 4వ సెమిస్టర్ పరీక్షలు జరిగి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఫలితాలు విడుదల చేయకపోవడం దారుణమని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వీసీ అప్పారావును మంగళవారం కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మార్కుల జాబితా అడుగుతున్నారని వెంటనే బీపీఈడీ ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, బీడీవీఎస్ వ్యవస్థాపకులు కొండా యుగంధర్, ఏపీ వీహెచ్ఎస్ సెక్రటరీ ముని, కిషోర్, పవన్, లిఖిత్, జేఏసీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



టాటా ట్రస్ట్ వారి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాకాల : స్థానిక పీహెచ్‌సీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ టాటా ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరీక్షలు చేపట్టారు. ముఖ్యంగా నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సమస్యలపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా స్థానికులకు ఉచితంగా బీపీ, షుగర్, స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. తిరుపతి నగరంలోని అలిపిరి జూపార్క్ సమీపంలోని స్వీకార్ క్యాన్సర్ హాస్పిటల్‌లో అతి తక్కువ ఫీజుతో ప్రముఖ వైద్యులు చేత వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కుమారి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్య బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కిరణ్మయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



పూర్వ విద్యార్థులను అభినందిస్తున్న మాతృశ్రీ పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ నాయుడు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి రైల్వేకాలనీలోని మాతృశ్రీ పాఠశాల పూర్వ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఐఐటీ జేఈఈ మెయిన్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. అందులో కె.కార్తికేయ 94.8 పర్సంటైల్, కె.కావ్య 91.8 పర్సంటైల్ స్కోరు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వారిని పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్‌నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

హెచ్‌ఎం ఉమాదేవి సేవలు ఎనలేనివి



దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల : స్థానిక ఉప్పరపల్లి ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తోన్న ఉమాదేవి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాబ్జి మాట్లాడుతూ 37 ఏళ్లుగా ఉమాదేవి ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం పదవీవిరమణ పొందిన ఉమాదేవి, ప్రకాష్‌రెడ్డి దంపతులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 లింగయ్య, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీ సురేష్, భాస్కర్‌నాయుడు, జయచంద్రారెడ్డి, మునిరత్నంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రసన్న వెంకన్న ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మే నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా మే 2, 9, 16, 23, 30 తేదీలలో శుక్రవారం సందర్భంగా ఉదయం 7 గంటలకు వస్త్రాలంకరణ సేవ అభిషేకం నిర్వహిస్తారు. 6న మంగళవారం ఉదయం అష్టదళ పాదపద్మారాధన సేవ, 14న ఉదయం 8 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం జరుగనుంది. 19న శ్రవణ నక్షత్రం సందర్భంగా ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

కలర్స్ హెల్త్ కేర్‌కు కమిషన్ వడ్డన

తిరుపతి లీగల్: సేవా లోపానికి పాల్పడినందుకు కలర్స్ హెల్త్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫిర్యాదికి పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పుచెప్పింది. వివరాలు.. తిరుపతి మధురానగర్‌కు చెందిన జే.సుమశ్రీ తిరుపతి, కేటీ రోడ్డు, కెఆర్ ప్రైడ్‌లోని కలర్స్ హెల్త్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 2023 జనవరిలో బరువు తగ్గడానికి చికిత్స నిమిత్తం చేరారు. ఆమె రెండు ఫైనాన్స్ సంస్థల్లో సొమ్మును రుణంగా తీసుకొని రూ.1.25 లక్షలను కలర్స్ సంస్థకు చెల్లించారు. మధ్యలో అనివార్య కారణాలవల్ల చికిత్సకు రాకపోతే చెల్లించిన సొమ్మును వెనక్కి ఇస్తామంటూ కలర్స్ సిబ్బంది ఆమెకు భరోసానిచ్చారు. చికిత్స కాలం రెండేళ్లని పేర్కొన్నారు. వారానికి రెండు రోజులు చొప్పున 80 సెషన్స్ కాలం చికిత్స అందజేస్తామని తెలిపారు. దీంతో ఆమె 2023 జనవరి 28వ తేదీన చికిత్సకు హాజరయ్యారు. మూడో సెషన్స్‌కూ ఆమె చికిత్సకు హాజరయ్యారు. తర్వాత ఆమెకు డెంగీ రావడం, తర్వాత గర్భం దాల్చడంతో చికిత్సకు హాజరు కాలేక పోయారు. మొదట్లో చెప్పిన విధంగా తాను చెల్లించిన సొమ్మును వెనక్కి ఇవ్వాలని ఆమె కలర్స్ సిబ్బందిని కోరారు. అయితే దీనిపై వారు స్పందించలేదు. దీంతో ఆమె తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కలర్స్ సంస్థ మేనేజర్‌పై ఫిర్యాదు దాఖలు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు టీ స్నేహలత, సభ్యులు నాగశశిధర్‌రెడ్డి కలర్స్ యాజమాన్యం ఫిర్యాదికి ఒక లక్ష 20 వేల 312 రూపాయల 50 పైసలను ఫిర్యాదు దాఖలు చేసిన తేదీ నుంచి తొమ్మిది శాతం వడ్డీ లెక్కన చెల్లించాలని తీర్పుచెప్పారు. అలాగే నష్టపరిహారం కింద రూ.25 వేల రూపాయలు, ఫిర్యాదు ఖర్చు కింద పదివేల రూపాయలను 45 రోజుల్లోపు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. అలా చెల్లించని పక్షంలో నష్టపరిహారం సొమ్ముకు ఆరు శాతం వడ్డీ లెక్కన చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఆమె చికిత్సకు హాజరైన మూడు సెషన్స్ కాలానికి 4687 రూపాయల 50 పైసలను కలర్స్ సంస్థ తీసుకోవాలంటూ తీర్పులో పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న గోపీ చౌదరి

తిరుపతి రూరల్, (రామచంద్రాపురం) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం మండలం ఎన్ఆర్ కమ్మపల్లికి చెందిన గోపీచౌదరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని తుమ్మలగుంటలోని ఇంటిలో మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు పార్టీలో సముచిత స్థానం కల్పించి మండల పార్టీ ప్రధాన కమిటీలో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువ కప్పి సత్కరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని మోహిత్‌రెడ్డి సూచించారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం

చంద్రగిరి: వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని విద్యార్థులు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తొండవాడ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో డిప్యూటీ డెమో కిరణ్ కుమార్, ఎంపీహెచ్ఓ రామాంజనేయ రెడ్డి వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవిలో ఇంట్లో వండిన ఆహారమే తినాలని, మంచి నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి అధికంగా తీసుకోవాలన్నారు.

సమసమాజ స్థాపకుడు లెనిన్



నివాళులు అర్పిస్తున్న సీపీఐ, అనుబంధ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: రష్యన్ విప్లవ సేనాని, సమసమాజ నిర్మాత లెనిన్ ఆశయసాధనకు యువత పాటు పడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అంతరాలు లేకుండా సమసమాజాన్ని నిర్మించిన యోధుడు లెనిన్ అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు రాధాకృష్ణ, డాక్టర్ ప్రసాద్, రవి, రాజా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నేత బండి చలపతి, ఏఐవైఎఫ్ జిల్లా నేత రామకృష్ణ, మహేంద్ర, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

కార్మికవర్గ పోరాటయోధుడు కామ్రేడ్ లెనిన్

కార్మిక వర్గ రాజ్యస్థాపన కోసం నిరంతరం పోరాడిన యోధుడు కామ్రేడ్ లెనిన్ అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో లెనిన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేతలు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు మండల కమిటీ నియామకం

తిరుపతి రూరల్ (చిన్నగొట్టిగల్లు) : వైఎస్సార్‌సీపీ చిన్నగొట్టిగల్లు మండల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

మండల పార్టీ అధ్యక్షుడు	: సింహాల మోహన్
ఉపాధ్యక్షుడు	: శేఖర్‌నాయుడు, నరసింహులు
ప్రధాన కార్యదర్శులు	: టిల్లుకుమార్ రెడ్డి, దినేష్‌రెడ్డి, మునిచంద్ర, గిరి, ఎ.మణి,
సెక్రటరీలు	: భయ్యారెడ్డి, మధుసూదన్ రెడ్డి, మస్తాన్, షాబ్జాన్, చలపతి, ఎం.ఉమామహేశ్వర

గ్రామ కమిటీ అధ్యక్షులు

చిన్నగొట్టిగల్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు	: దమరకనాథగుప్తా,	కోటబైలు	: హేమేంద్రరెడ్డి,
నెల్లుట్లవారిపల్లి	: టి.నరసింహారెడ్డి	చిట్టేచర్ల	: సుభాస్కర్‌రెడ్డి,
జంగావాండ్లపల్లి	: ఎం.విశ్వనాథరెడ్డి,	రంగన్నగారిగడ్డ	: శివ,
భాకరాపేట	: టి.రమణ,	దీన్‌దార్లపల్లి	: షాబాద్,
ఎగువూరు	: కృష్ణయ్య,	దిగువూరు	: ఓ.హరినాథరెడ్డి,
టి.శెట్టివారిపల్లి	: వై.రఘునాథ,	తిప్పిరెడ్డిగారిపల్లి	: కె.రఘునాథరెడ్డి,
		దేవరకొండ	: సుధాకర్

అనుబంధ విభాగాల అధ్యక్షులు...

మండల యూత్ వింగ్	: మునిరెడ్డి,	ఆర్‌టీఐ వింగ్	: విజయకుమార్,
మహిళా విభాగం	: రుక్మణమ్మ,	వలంటీర్ వింగ్	: కిషోర్,
రైతు విభాగం	: శ్రీధర్‌రెడ్డి,	వాణిజ్య విభాగం	: మల్లికార్జునరెడ్డి ,
బీసీ సెల్	: బాలసుబ్రమణ్యం,	వైఎస్సార్‌టీయూసీ	: పి.లోకేష్,
ఎస్సీ సెల్	: సుబ్బయ్య,	అంగన్‌వాడీ వింగ్	: విమల,
ఎస్టీ సెల్	: నాగరాజ	సాంస్కృతిక విభాగం	: శివరామయ్య,
మైనార్టీ సెల్	: బావాజీ,	సోషల్ మీడియా వింగ్	: వంశీ,
క్రిస్టియన్ మైనార్టీ సెల్	: రాజశేఖర్,	దివ్యాంగుల విభాగం	: ఖాదర్‌వల్లీ,
స్టూడెంట్ వింగ్	: హరి,	పబ్లిసిటీ విభాగం	: గణేష్,
పంచాయతీ రాజ్ వింగ్	: సాకిరి భూపాల్,	వీవర్స్ విభాగం	: సుబ్రమణ్యం

భూ సంరక్షణకు నడుం బిగించాలి



ప్రసంగిస్తున్న ఎస్వీయూ వీసీ అప్పారావు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీడబ్ల్యూ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: భూసంరక్షణ కోసం యువత నడుం బిగించాలని ఎస్వీయూ వీసీ అప్పారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్వీయూ, ఏపీ యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ భూమి నుంచి లభించే నీరు, గాలి, ఆహారం అన్నీ కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితి నుంచి బయట పడాలంటే యువతరం భూ సంరక్షణలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, సెట్విన్ కార్యనిర్వాహణాధికారి మోహన్‌కుమార్, ఆచార్య మురళీధర్, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వివేక్, ప్రిన్సిపల్ ఆచార్య ఓవీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో

పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యులు కావాలని వీసీ ఉమ, కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం పిలుపునిచ్చారు. డాక్టర్ పట్టాభిరామ్, డీన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్పీడబ్ల్యూలో...

పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ టీ.నారాయణమ్మ విద్యార్థులకు భూసంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

స్నేహబంధాలకు వేదిక వర్సిటీ



ప్రసంగిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో హాస్టల్ డే వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ ఉమ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ హాస్టల్ జీవితం అద్భుతమైన జ్ఞాపకాలతో నిండినదని, విద్య, అనుభవం, స్నేహబంధాలు ఇక్కడే ఏర్పడతాయని తెలిపారు. హాస్టల్ జీవితం విద్యార్థుల స్వావలంభనకు, మానసిక బలానికి, స్నేహసంబంధాల పెంపునకు సరైన వేదిక అన్నారు. జీవితంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, అయితే పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను ఛేదించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, వార్డెన్ ప్రొఫెసర్ సావిత్రి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రక్షించాల్సిన వారే చెట్లను నరికేస్తారా ?



మీడియాతో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ''పర్యావరణాన్ని పరిరక్షించి మానవ మనుగడతో పాటు అనేక జంతుజాతులను సంరక్షించాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులపై ఉంది. అయితే పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన వారే భక్షిస్తున్నారు'' అని ప్రకృతి ప్రేమికుడు, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన నగరవనంలోని 20 నుంచి 30 ఏళ్ల నాటి వృక్షాలను అటవీ అధికారులే క్యాంటీన్ ఏర్పాటు కోసం నరికి వేయడంపై నగరవనాన్ని సందర్శించారు. 20 నుంచి 30 ఏళ్ల నాటి అనేక వృక్షాలను అటవీ అధికారులు నరికివేయడాన్ని చూసి ఆయన చలించిపోయారు. ఆయన మాట్లాడుతూ అలిపిరి–కపిలతీర్థం మధ్యలో ఉన్న నగరవనంలో వేలాదిమంది నగర ప్రజలతో పాటు శ్రీవారి భక్తులు సైతం సేదతీరుతుంటారని తెలిపారు. అలాంటి నగరవనంలోని భారీ వృక్షాలను క్యాంటీన్ కోసం నరికివేయడం ఏమిటని ప్రశ్నించారు. అటవీ అధికారులే భారీ వృక్షాలను నరికివేస్తుంటే అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఏమి చేస్తున్నారని నిలదీశారు. ఇప్పటికైనా అటవీఅధికారులు తమ తీరు మార్చుకుని నగరవనంలో మరిన్ని వృక్షాలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. లేనిపక్షంలో ప్రకృతి ప్రేమికుడిగా తాను ప్రకృతి ప్రేమికులు, జంతుప్రేమికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతానని హెచ్చరించారు.

పర్యావరణ రక్షణ పౌరుల బాధ్యత



శ్రీహరి కాలనీలో మొక్కలు నాటుతున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సంస్కృతంలో క్షమయా ధరిత్రిగా పిలుచే తల్లి భూమిని పరిరక్షించడాన్ని పౌరులందరి ఉమ్మడి బాధ్యతగా భావించి మార్గనిర్దేశం చేయాలని ఎస్వీయూ మాజీ వీసీ, ప్రొఫెసర్ రాళ్లపల్లి రామమూర్తి పిలుపునిచ్చారు. దివ్యారామం వాకర్స్ ఆధ్వర్యంలో భూమి దినోత్సవం సందర్భంగా మంగళవారం శ్రీహరి కాలనీలో ప్లాంటేషన్ డ్రైవ్‌లో వాకర్స్ ఎర్త్‌డే ఉత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలకు తోడ్పడడానికి సుగంధ ద్రవ్య వృక్ష జాతికి చెందిన నేరేడు మొక్కతో సహా పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గీతం, గేట్ కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, జీసీ, రాజేంద్రరెడ్డి, శేఖర్‌నాయుడు, చంద్ర, అమర్‌నాథ్‌రెడ్డి, రామనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య వెల్డింగ్‌షాపు ఎలా పెడతారు ?



భూపాల్ హౌసింగ్ కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న వెల్డింగ్ షాపు

తిరుపతి మంగళం : నిత్యం శబ్దాలతో కూడిన వెల్డింగ్ షాపు జనావాసాలకు దూరంగా పెట్టుకోవాలే తప్ప ఇళ్ల మధ్యలో ఎలా పెడతారని, వారికి అనుమతులు ఎవరిచ్చారని తిరుపతి శివారు ప్రాంతంలోని భూపాల్ హౌసింగ్‌కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తిరుపతి–కరకంబాడి మార్గంలోని తిరుపతి కార్పొరేషన్ 1వ డివిజన్ భూపాల్‌హౌసింగ్ కాలనీలోని ఇళ్ల మధ్య కొందరు వెల్డింగ్‌షాపు నిర్వహిస్తున్నారు. ఈ షాపులో నుంచి పెద్దపెద్ద శబ్దాలు, వెల్డింగ్ కాంతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికంగా నివాసం ఉంటున్న విశ్రాంతి ఉద్యోగులు సిద్ధయ్యతో పాటు మరికొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య నుంచి వెల్డింగ్ షాపు తొలగించాలని కార్పొరేషన్ అధికారులకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దాంతో స్పందించిన కార్పొరేషన్ అధికారులు అక్కడ నుంచి వెల్డింగ్ షాపును తొలగించాలని నోటీసులు ఇచ్చారు. దాంతో వెల్డింగ్ నిర్వాహకులు పదిహేనురోజులు గడువులోపు ఖాళీ చేస్తామని చెప్పారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో భాష్యకార్ల ఉత్సవం ఆరంభం సందర్భంగా ఉదయం 7.30 గంటలకు బంగారు తిరుచ్చిపై భాష్యకార్ల చిన్న మాడవీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు పెద్ద మాడవీధి ఉత్సవం నిర్వహణ
- శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ×సైన్స్, టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్ ఆ అంశంపై ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ సదస్సు
- ఎస్వీయూ పరిధిలో ఈనెల 22, 23న జరగాల్సిన డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు సాంకేతిక కారణాలతో మే 12, 14వ తేదీకి వాయిదా పడ్డాయి.
- రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు విడుదల కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు
- వసుంధర జ్యువెలరీస్ ఆధ్వర్యంలో హోటల్ కెన్సెస్‌లో ఉదయం 11 గంటలకు జ్యువలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం
- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం
- శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో పనికిరాని వస్తువులైన ఇనుము, ప్లాస్టిక్ సేకరణకు ఉదయం 9 గంటలకు బహిరంగ వేలం, అలాగే 11 గంటలకు అమ్మవారికి సమర్పించే వెయ్యికళ్ల దుత్తలు విక్రయ హక్కుకు బహిరంగవేలం
- మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసం వద్ద ఉదయం 10.30 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహణ
- జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ ఎంపవర్‌మెంట్, రిలేషన్స్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉదయం 9 గంటలకు శ్రీసిటీ సందర్శన అనంతరం 10 నుంచి 11.30 గంటల వరకు ఇండస్ట్రీస్ అసోసియేషన్, మానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ వారితో సమావేశం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సోమవారం అర్ధరాత్రి వరకు 72,937 మంది స్వామివారిని దర్శించుకోగా 24,157 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.79 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ నటుడు విజయ కుమార్ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఆయన తన కుమార్తె, నటి శ్రీదేవి, ఇతర కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

ప్లాస్టిక్‌తో దుష్పరిణామాలు

చంద్రగిరి: మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో మంగళవారం ఘనంగా ఎర్త్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎఫ్ఎస్ అధికారులు వివేక్, నరేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ భూమిపై ప్లాస్టిక్ వినియోగం అధికం కావడంతో అనేక దుష్పరిణామాలు జరుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, భూమి సంరక్షణ కోసం సంప్రదాయ పద్ధతులను పాటించడం ద్వారా స్థిరత్వాన్ని మెరుగు పరుచుకోవచ్చని తెలిపారు. అనంతరం వారిని ఎంబీయూ అధికారులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వీసీ కరుణాకరన్, రిజిస్ట్రార్ సారథి,విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీ అమ్మవారి ఆలయం ఏవీఎస్‌ఓ సతీష్‌కుమార్ పిలుపు మేరకు తిరుపతి అగ్నిమాపక కేంద్రం అధికారులు ఆలయం వద్దకు చేరుకుని పోటు సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇటీవల ఆలయానికి కొంతదూరంలోని మూడవ గేటు సమీపంలో అకస్మాత్తుగా మంటలు రావడం, వాటిని అదుపు చేయలేక తిరుపతి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు మంటలు ఎగసి పడ్డాయి. ఈ నేపథ్యంలోనే పోటు సిబ్బంది, విజిలెన్స్ సిబ్బందికి, ఆలయ సమీపంలోని దుకాణదారులు, హోటళ్ల యజమానులకు అవగాహన కల్పించారు.